క్లుప్తంగా

తుంగపల్లెమ్మ అమ్మవారికి నైవేద్యాలు



కోడూరు: మండలంలోని మాచవరం గ్రామ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న తుంగ పల్లెమ్మ అమ్మవారికి గురువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా శర న్నవరాత్రి ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరిం చుకొని అమ్మవారి మూలమూర్తికి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వంతెన సెంటర్ నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ గ్రామస్తులంతా నైవే ద్యాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసు కువచ్చారు. వరుస క్రమంలో నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లిం చారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ స్తులు గ్రామానికి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో గ్రామంలో పండువ వాతా వరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో భవానీ మాల ధారణ

నాగాయలంక: దసరా ఉత్సవ పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని పలువురు భక్తులు గురువారం భక్తి శ్రద్ధలతో భవానీ మాల ధారణ దీక్ష తీసుకున్నారు. స్థానిక కృష్ణా తీరంలోని కనకదుర్గమ్మ ఆలయంలో భావదేవ రపల్లి గ్రామ మహిళలకు ఆలయ అర్చకుడు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో దిండి గ్రామానికి చెందిన భక్తు లకు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు భవానీ మాలధారణ చేశారు. మండలంలో దాదాపు యాభై మంది భక్తులు దీక్ష స్వీకరించారు.

పెడన ఎంపీడీవో రెడ్డయ్య బదిలీ

పెడన: పెడన మండల పరిషత్ అభివృద్ధి అధి కారి(ఎంపీడీవో) వి.రెడ్డయ్య పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు బదిలీ అయ్యారు. గురు వారం సాయంత్రం రిలీవ్ కావడంతో కార్యా లయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు రెడ్డయ్యను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలి కారు. ఆయన స్థానంలో ఈవోపీఆర్డీ జయరాం కు ఇన్చార్జి ఎంపీడీవోగా బాధ్యతలను అప్ప గించారు.

సాయిబాబాకు వెండి దీపారాధన కుందులు బహూకరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరా మునిపేటలో ఉన్న శ్రీ కోదండరామాలయం లోని షిర్డీ సాయిబాబాకు కాకినాడకు చెందిన కోకా కుర్మేశ్వరరావు–శైలజ దంపతులు గురువారం రూ.50 వేల విలువైన వెండి దీపారాధన కుందులు బహూకరించారు. వీటిని ఆలయ ధర్మకర్త పిల్లారిశెట్టి శ్రీనివాస రావుకు అందజేశారు.

శ్రీమన్నారాయణుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెం గ్రామం లో ఉన్న గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారా యణ స్వామివారికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బృందావనం అష్టాక్షరీ స్వామిజీ బుద్ధ ప్రసాద్‌కు తీర్థప్రసాదాలు అందించారు.

హైదరాబాద్ నుంచి దసరా ప్రత్యేక బస్ సర్వీసులు

అవనిగడ్డ: దసరా పండుగను పురస్కరిం చుకుని హైదరాబాద్ నుంచి అవనిగడ్డకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నట్లు డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, ఈసీ ఐఎల్ నుంచి అవనిగడ్డకు ఈనెల 3వ తేదీ నుం చి 11వ తేదీవరకే నడపనున్నట్లు చెప్పారు. అవనిగడ్డ నుంచి ఆయా ప్రాంతాలకు ఈనెల 13,14,15 తేదీల్లో ఈ ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతామని తెలిపారు. ఎలాంటి అదనపు చార్జీలు ఉండవన్నారు.

రేపటి నుంచి ద్వారకా తిరుమలకు బస్ సర్వీసు ప్రారంభం

ఈనెల 4వ తేదీ నుంచి ద్వారకా తిరుమలకు ప్రత్యేక బస్ సర్వీసు నడపనున్నట్లు డిపో మేనే జర్ హనుమంతరావు తెలిపారు. పామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా ద్వారకా తిరుమలకు ఈ సర్వీసుని నడపనున్నట్లు డీఎం చెప్పారు. ప్రయాణికులు, భక్తులు ఈ సర్వీసులను వినియోగించుకో వాలని కోరారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీ ఎంపిక

కోడూరు: విశ్వహిందూ పరిషత్ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఐనాల మధుబాబు, ఉపాధ్య క్షురాలిగా పాలంకి రమాదేవి, కార్యదర్శిగా పూతబోయిన లంకేశ్వరరావు, సహాయ కార్య దర్శిగా బాసా సరోజిని, కోశాధికారిగా పూత బోయిన రాంబాబు ఎంపికయ్యారు.

కొండలమ్మ ఆలయ దసరా ఉత్సవాలకు ఎస్పీకి ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగే దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ ఈవో ఎ.కొండలరావు గురువారం ఎస్పీ ఆర్.గంగాధరరావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని ఎస్పీకి బహూకరించి దుశ్శా లువాతో సత్కరించారు.



పాశ్వాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో...



కోడూరులో బాలాత్రిపుర సుందరీదేవిగా...



శ్రీరామపాదక్షేత్రం కనక దుర్గమ్మ ఆలయంలో...



అడ్డపర్ర వనదుర్గాదేవి ఆలయంలో...



పెడనలో బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో



గూడూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో...



నాగాయలంక ప్రధాన ఆలయంలో రజత కవచ, బాలా త్రిపుర సుందరిగా పార్వతీదేవి, కన్యకాంబ



మచిలీపట్నం దత్తాశ్రమంలో వారాహి అమ్మవారు



పెడనలో కన్యకా పరమేశ్వరి దేవి అలంకరణలో...

జగజ్జననీ.. పాహిమాం!

- ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

కోడూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురు వారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కోడూరులోని గంగాభవానీ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ మంత్రోచ్చరణల నడుమ మహిళలతో సామూహిక కుంకుమార్చనను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. విశ్వనాథపల్లిలోని అద్దంకి నాం చారమ్మ అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదే విగా భక్తులకు దర్శనమిచ్చారు. సంతమార్కెట్ సమీ పంలోని కనకదుర్గమ్మ అమ్మవారు బాలాత్రిపురసుం దరీ దేవిగా దర్శనమివ్వగా, మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు, యాళ్లమ్మ, కోడూరులోని పార్వతీదేవి, దానాశక్తి అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. నరసింహా పురంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి పూజలు నిర్వహించారు.

నాగాయలంకలో...

నాగాయలంక: స్థానిక కృష్ణాతీరంలోని శ్రీరామ పాద క్షేత్రం ప్రాంగణంలోని శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో గురువారం దసరా ఉత్సవాలను కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆలయ అర్చకుడు ముదునూరి శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో ఉభయదాతలుగా మండవ వెంకట సుబ్బా రావు–బసవ పూర్ణమ్మ దంపతులు ఉత్సవ ప్రధాన పీఠం వద్ద పీటలపై కూర్చుని శ్రీబాలాత్రిపుర సుం దరి దేవిగా అమ్మవారికి విశేషపూజ, తదుపరి యాగ శాలలో హోమం నిర్వహించారు. గణపేశ్వరంలోని చారిత్రక దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో దుర్గమ్మ శ్రీబాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మండల రాంబాబు, అరుణ దంపతులు కలశస్థాపన పూజతో దసరా వేడుకలకు శ్రీకారం చుట్టారు. భావదేవరపల్లిలో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి సమేత శ్రీఅన్నపూర్ణదేవి ఆలయం, గ్రామదేవత అంకాలదేవర ఆలయం, టి.కొత్తపాలెం శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆరంభిం చారు. ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మారెడ్డి సత్యనారా యణ(సత్తిబాబు), ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షణలో అర్చకులు అలంకారాలు చేసి పూజలు జరిపారు. స్థానిక శ్రీపార్వతీ సమేత, కన్యకాపర మేశ్వరీ సమ న్విత శ్రీనగరేశ్వర స్వామివారి దేవస్థా నం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ఆరంభమ య్యాయి. తొలుత ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లి పర సుబ్బారావు నేతృత్వంలో కమిటీ సభ్యులు మం గళ వాయిద్యాలతో కృష్ణానదికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. నదీజలం కలశంతో ఆలయానికి చేరుకుని 11గంటలకు అమ్మవారి శ్రీచక్ర కలశస్థాపన మహోత్సవం జరిపారు. పీఠం వద్ద తాడికొండ సత్య నారాయణ–జయలక్ష్మి దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ప్రధానాలయంలో పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరి దేవీ రజత కవచాలంకారం, బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయకమిటీ చైర్మన్ చిట్టా సాంబశి వరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకన్యకాపర మేశ్వరి ఆలయం ప్రాంగణలోని జమ్మిచెట్టు వద్ద ఈ ఏడాది స్థానిక మిఠాయి వర్తకుడు వంకాయల ఆదిరాజేష్ కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో 5 అడుగుల కనక దుర్గమ్మ విగ్రహం ఏర్పాటుచే శారు. ఆలయ కమిటీ చైర్మన్ సాంబశివరావు అమ్మవారి ఉత్సవ వేదికను ప్రారంభించారు.



పెడన శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను శివాలయం, అడ్డపర్ర, నీలిపూడి, మునిపెడ, చినపాండ్రాక, లక్ష్మీ పురం, మాట్లాం, చినగొల్లపాలెం, పల్లెపాలెం, పోడు తదితర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలం కరించి పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రతిరోజు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించనున్నట్లు అర్చకులు తెలిపారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండల పరిధిలో గ్రామగ్రామాన కొలువై ఉన్న శివాలయాలు, వైష్ణవాలయాల్లో దేవీన వరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బంటుమిల్లి కనకదుర్గానగ ర్‌లో ఉన్న కనకదుర్గా ఆలయం, పాశ్వాపురంలో సువర్చలాంజనేయస్వామి ఆలయం, లక్ష్మీనారాయ ణపురం రామాలయంలలో అమ్మవార్లకు శ్రీబాలాత్రి పురసుందరీ దేవి అలంకరణలో పూజలు నిర్వహిం చారు. పెద తుమ్మిడి, ఆర్తమూరు గ్రామాల్లోని శివాల యాల్లో అమ్మవార్లను పార్వతీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బం టుమిల్లిలో ఉన్న రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవార్లకు శ్రీఆదిలక్ష్మీదేవి అలంకర ణలో పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో సామూ హిక కుంకుమ పూజలు నిర్వహించారు.

పెడనలో...

పెడన: శ్రీదేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు గురు వారం పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభ మయ్యాయి. పట్టణంలో ఉన్న గ్రామ దేవత శ్రీపై డమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మొదటి రోజు బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఉభయదాతలు దావు పైడేశ్వరరావు, నాగమణి దం పతులతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆసాది తోట వెంకట రామారావు, ఈవో టీవీవీ మోహనరావులతో పాటు ఆలయ కమిటీ భక్త బృం దం ఆనందరావు, జయకృష్ణ, సాంబశివరావు, యల్లారమ్మ, పద్మావతి, వడ్డీ కాసులు తదితరులు పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఘటం దేవస్థానంలో అమ్మవారిని శ్రీబాలత్రిపురసుందరీ దేవి అలంకర ణలో దర్శనమివ్వగా నాదెళ్ల కోటేశ్వరరావు దంప తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.108 మంది సువాశినులు 108 సార్లు లలితా పారాయణం పఠించారు. ఈ సం దర్భంగా కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. తొలిరోజు తమ్మన వెంకటసుబ్బారావు కుమారులు లీలావెంకట శివరామప్రసాద్, పద్మసాయి, లలితశం కర్, అన్నపూర్ణ దంపతులు ఉభయదాతలుగా పాల్గొ న్నారు.

శ్రీకాకుళంలో...

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళంలోని శ్రీ ముది రాజుల రామాలయంలో గురువారం శ్రీదేవీ శరన్న వరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమ య్యాయి. గ్రామానికి చెందిన పోతురాజు బాలకృష్ణ – పావని దంపతులు అమ్మ వారి విగ్రహాన్ని ఆలయ కమిటీ వారికి అందించగా మొదటిరోజు అమ్మ వారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. అమ్మ వారికి కోడి చిన వెంకటస్వామి – చిన కృష్ణవేణి దంపతులు అర్చకులు వాడపల్లి సత్య శ్రీరామ గణేష్ (శ్రీరామ్) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గూడూరులో...

గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శర న్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారం భమయ్యాయి. గూడూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుంద రీదేవి రూపంలో అలంకరించారు. గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, గాంధీబొమ్మ సెం టరు, సీహెచ్‌సీ సెంటర్లలో కూడా అమ్మవారి ప్రతి మను ప్రతిష్టించి దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహి స్తున్నారు.

పెదకళ్లేపల్లిలో...



పెదకళ్లేపల్లిలో బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చిన దుర్గాదేవి అమ్మవారు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరు గాంచిన పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థా నంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చ కులు బుద్ధు ప్రసాద్ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దుర్గామా తను బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరిం చారు.

భక్తి శ్రద్ధలతో ప్రారంభమైన దసరా నవరాత్రోత్సవాలు

మచిలీపట్నంటౌన్: దసరా పండుగ సందర్భం గా శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నగ రంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద గురు వారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. హిందూ కళాశాల ఆవరణలోని సరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంక రించగా ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయ ణరావు సారె సమర్పించారు. నగరంలోని గీతా మందిరంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ వాసవీ కన్యకాపర మేశ్వరి అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరి దేవిగా, శ్రీ లలితా అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. గానుగకొట్టు సెంటరులో శర న్నవరాత్రి పందిరి వద్ద అమ్మవారి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో 10 అడుగుల వారాహి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు. పలు వురు యువ గాయకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీక రించారు. రేవతి సెంటరులోని గంగానమ్మ ఆల యం, రాజుపేట ముత్యం గుడి, బెల్లంకొట్ల సం దులోని మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం, ప్రధాన రహదారిలో విజయదుర్గాదేవి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు.



హిందూ కళాశాలలో దుర్గాదేవి అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

శక్తి పటాలకు పూజలు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శక్తిపటాలకు అమావాస్య రోజైన బుధవారం అర్ధరాత్రి ఊరేగిస్తూ పూజలు చేశారు. అనం తరం నగరంలో శక్తిపటాల ఊరేగింపు పూజలు ప్రారంభమయ్యాయి.

వాడీవేడిగా గ్రామ సభలు

గ్రామసభను బాయ్‌కాట్ చేసి ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన సర్పంచ్

నాగాయితిప్ప(మోపిదేవి): ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో తరచూ వివాదాలు చోటు చేసుకుంటూ బజారున పడుతున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించుకోవ డానికి ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేయగా అక్కడ ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య వాదోపవాదనలతో సరిపుచ్చుతున్నారని, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని నాగాయితిప్ప, మెరకనపల్లి, కోసూరువారిపాలెంలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఉదయం నాగాయి తిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గరికి పాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ ప్రారం భించారు. ఆ సమయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు కాని, ఎంపీటీసీ సభ్యులు కాని, గ్రామ ప్రముఖులు కాని ఎవరూ హాజరు కాకపోవడాన్ని గమనించి సర్పంచ్ గ్రామ కార్యదర్శి రమణను ప్రశ్నించారు. తాను చెప్పానని, వారే రాలేదని సమా ధానం ఇవ్వడంతో తాను కూడా ఫోన్ చేసి వాకబు చేశారు. కార్యదర్శి ఏ మాత్రం సమాచారం ఇవ్వలేద ని, కనీసం గ్రామంలో టాంటాం కూడా వేయంచ లేదని ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల నుంచి తెలు సుకున్న సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు లేకుండా గ్రామ సభ దేని కని, తాను కూడా వెళ్లిపోతున్నానని చెప్పి బాయ్ కాట్ చేశారు. అనంతరం నేరుగా ఎంపీడీవో కార్యాల యానికి వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో కె.శ్రీనివాసరావు సర్పంచ్ ఫిర్యాదును జిల్లా కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు. గతంలో కూడా కార్యదర్శిపై అనేక ఫిర్యాదులు వచ్చాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసు కెళ్లినా ఆయనలో మార్పురాలేదని సర్పంచ్ వెంకటే శ్వరరావు విచారం వ్యక్తంచేశారు. మెరకనపల్లి పంచాయతీలోనూ తూతూ మంత్రంగా గ్రామ సభ నిర్వహించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచే శారు. ఇక్కడ కూడా గ్రామంలో టాంటాం వేయ లేదని గ్రామస్తులకు తెలియకుండానే గ్రామ సభ నిర్వహించడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాల వల్ల మురుగు పేరుకుపోయి దోమలు పెరిగిపోయాయని, దోమల మందు చల్లిం చాలని ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకో వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోసూరువారి పాలెంలో సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన గ్రామ సభను గ్రామకార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వర రావు నిర్వహించారు.



నాగాయతిప్ప గ్రామ సభలో సర్పంచ్, కార్యదర్శి మధ్య వాదోపవాదాలు

విశాఖ ఉక్కును పరిరక్షించాలి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

మచిలీపట్నంటౌన్: ఆంధ్రులకు విశాఖ ఉక్కు అన్న నినాదంతో ఏర్పాటు చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమను నేటి పాలకులు పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగం టి హరిబాబు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కును పరి రక్షించాలని కోరుతూ స్థానిక కోనేరుసెంటరులో గురువారం పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన హరి బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఎంతో ఆదా యాన్ని సమకూర్చి పెడుతున్న విశాఖ ఉక్కును ప్రైవే టీకరించాలని కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాలపై కార్యాచరణ చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే పరి శ్రమలో పనిచేస్తున్న 4 వేల మంది కాంట్రాక్టు ఉద్యో గులను ఒకేసారి తొలగించేందుకు కుట్ర పన్నిం దన్నారు. విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రస్తుతం నోరు మెదపక పోవటం విచారకరమన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి విశాఖ ఉక్కును పరిరక్షించాల్సిన అవ సరం ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.నాగేంద్రం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్య క్షుడు శీలం నారాయణరావు, సీఐటీయు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, ఏఐటీయుసీ జిల్లా నాయకులు తాతయ్య, ఓఎల్ రావు పాల్గొన్నారు.



నిరసన దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు చెమ్మనగిరి పేట, రుస్తుంబాద, రాజాగారిసెంటరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంద న్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమ నించాలని ఆయన కోరారు.

తడి, పొడి చెత్తలపై ప్రజలను చైతన్యపరచండి

కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నంటౌన్: ఈనెల 5 వ తేదీ శనివారం నుం చి నగరంలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా ఇచ్చేలా నగర ప్రజలను చైతన్యపర చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగర పాలక సం స్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరపా లక సంస్థ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొంది అవార్డుకు ఎంపికైన మున్సిపల్ కమి షనర్ బాపిరాజును కలెక్టర్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

టెట్ పరీక్షకు తొలి రోజు 313 మంది హాజరు

పెడన: మండల పరిధిలోని నందమూరు గ్రామం లో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 9.30 నుంచి మధ్యాహ్నం 12 గం టల వరకు జరిగిన ఉదయం సెషన్‌లో 190 మం దికి గాను 152 మంది హాజరయ్యారని పరీక్ష కేం ద్రం అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్లో 190 మందికి గాను 161 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

కృత్తివెన్ను: వాహనం నడిపే వ్యక్తులు తమ వద్ద వాహనానికి చెందిన అన్ని పత్రాలతో పాటు, డ్రైవిం గ్ లైసెన్సు కలిగి ఉండాలని ఎస్‌ఐ పైడిబాబు అన్నారు. గురువారం ఆయన సంగమూడి వద్ద 216 జాతీయ రహదారిపై నాకాబందీలో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రతలో భాగంగా నిబంధనలకనుగుణంగా ప్రయాణాలు సాగించాలని ఎస్‌ఐ వాహనదారులకు సూచిం చారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పనిస రిగా హెల్మెట్ ధరించాలన్నారు.

వీఆర్వోల బదిలీలు

గూడూరు: మండలంలో పలువురు వీఆర్వోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐదుగుళ్లప ల్లి వీఆర్వో గుడివాడ వెంకట సుబ్బారావును ముక్కొల్లు వీఆర్వోగా బదిలీ చేశారు.కంచాకోడూరు వీఆర్వో కె.బాజీరావును బాపులపాడు మండలం వేలేరుకు బదిలీ చేయగా, నందివాడ మండలం పోలుకొండ వీఆర్వో పి.నెలబాలుడును గూడూరు మండలం తరకటూరు వీఆర్వోగా నియమించారు.

వ్యర్థాలతో కళాకృతులు

అవనిగడ్డ: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు చూపిన కళాత్మకతను ఎంఈవోలు నారే పాలెం శంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య అభినం దించారు.

ప్రాచీన కళారూపాలను ప్రోత్సహించడం అభినందనీయం

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

చిట్టూర్పు(ఘంటసాల): అంతరించిపోతున్న ప్రాచీన సంప్రదాయ కళలైన తాళ భజన, మురళీ కోలాటంలను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంట సాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కనకదుర్గ అమ్మ వారి దసరా ఉత్సవాల సంద ర్భంగా కృష్ణా – ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళ భజన, మురళీ కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీ లను గురువారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రాచీన కళల ప్రోత్సాహానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తాళ భజన పోటీల్లో పాల్గొన్న కళాకారులను అభినందించారు. నిర్వాహక కమిటీ సభ్యుడు గుత్తికొండ ప్రసాద్ మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలు గురువారం నుంచి 11వ తేదీ వరకు జరుగు తాయని, విజేతలకు రూ.10వేలు మొదటి బహు మతి, రూ.5 వేలు రెండవ బహుమతి, రూ.3వేలు మూడవ బహుమతి అందించనున్నట్లు తెలిపారు. మొదట జరిగిన పోటీల్లో భద్రిరాజుపాలెం గ్రామా నికి చెందిన శ్రీగీతాకృష్ణ మహిళా భజన సమాజం పాల్గొనగా జడ్జిగా పాడుగు ప్రభాకర్, పి.ఏసుపాదం వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న భజన బృందా లకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, టీడీపీ నేతలు బండి పరాత్పరరావు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, పరిశే చలపతి, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, ఆర్కిటెక్ ఇంజినీర్ మల్లుపెద్ది వెంకట నారాయణ, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులు దాసరి సురేష్, సతీష్, వేములపల్లి వెంకట్రావు, యలవర్తి వంశీ, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాస రావు, వివిధ భక్త సమాజాలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీ గీతాకృష్ణ మహిళా భక్త సమాజంకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, నిర్వాహకులు

వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగా యని, వీటిని ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. ఎన్నో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఓటర్లను నమోదు చేయించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతంరెడ్డి

నందిగామలో గ్రామసభ

పెడన: గ్రామసభల ద్వారా ప్రజా ప్రణాళికలు రూపొందించుకుని పంచాయతీలు అన్ని రంగాలలో సమగ్రం గా అభివృద్ధి చెందాలని పెడన మండలం నందిగామ సర్పంచ్ బొడ్డు హరి బాబు అన్నారు. గ్రామ సచివాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు గుర్నాధం, కార్యదర్శి, సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.